క్లుప్తంగా

18న రాప్తాడులో సిద్ధం సభ



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ కన్వీనర్ చౌడేశ్వర్

తంబళ్లపల్లె : ఈ నెల 18న అనంతపురం జిల్లా రాప్తాడులో జరిగే సిద్ధం సభకు ప్రజలు తరలి రావాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చౌడేశ్వర్, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక ఎంపీపీ చాంబర్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సభకు సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి హాజరవుతారని, ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రజలకు తెలిపి సభకు వచ్చేలా కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో సర్పంచుల సంఘం అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, మల్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

న్యాయం జరిగింది

మదనపల్లె సిటీ : తిరుపతి కన్యకా పరమేశ్వరీ ఆలయ భూముల విషయంలో సుప్రీంకోర్టు అనుకూలంగా తీర్పు ఇవ్వడంతో ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గార్ల చంద్రమౌళి హర్షం వ్యక్తం చేశారు. భూములకు టైటిల్‌డీడ్ లేని కారణంగా అన్యాక్రాంతం అవుతుండడంతో జక్కా సుబ్బరాజ సుప్రీంకోర్టులో కేసు దాఖలు చేశారన్నారు. ఆలయానికి అనుకూలంగా తీర్పు రావడంతో ఆర్యవైశ్యులకు న్యాయం జరిగిందన్నారు.

పాడి రైతులకు అవగాహన



పశువులకు మందులు వేస్తున్న భాస్కరాచారి, డాక్టర్ సురేష్

నిమ్మనపల్లె : చెరువు ముందరపల్లెలో కలుషిత ఆహారం తిని రెండు పశువులు మృతి చెందడంతో పాడి రైతులకు అవగాహన కల్పించామని పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ సాధు సురేష్ తెలిపారు. మండలంలోని చెరువు ముందరపల్లె(నల్లగొండ)లో మదనపల్లి లయన్స్ క్లబ్, నిమ్మనపల్లి పశుసంవర్ధక శాఖ వారి ఆధ్వర్యంలో గురువారం పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిల్వచేసిన ఎండు గడ్డిలో తేమ అధికమై గడ్డి కుళ్లడం, ఆ గడ్డిని పశువులకు మేతగా అందించడంతో పశువులలో అనారోగ్య సమస్యలు ఏర్పడ్డాయన్నారు. ఎండుగడ్డిని ఎండబెట్టి మేతగా అందించాలన్నారు. అనంతరం 27 దూడలకు నట్టల నివారణ మందులు, 53 పశువులకు వైద్యం అందించి, మందులను పంపిణీ చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో భాస్కరాచారి, మహేష్, డి డాక్టర్ హసన్, డాక్టర్ సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ల్యాప్‌టాప్ వితరణ

మదనపల్లె సిటీ : స్థానిక సొసైటీ కాలనీలోని లయన్స్ కంటి ఆస్పత్రికి అమెరికాకు చెందిన బోడిపాటి అజయ్‌కుమార్, మీనా ల్యాప్ టాప్‌ను ఉచితంగా అందజేశారు. ఆస్పత్రిలో జరిగిన సమావేశంలో లయన్స్‌కంటి ఆస్పత్రి చైర్మన్ భాస్కర్‌నాయుడు మాట్లాడుతూ ఆస్పత్రి అభివృద్ధికి ఎన్ఆర్ఐ అజయ్‌కుమార్ సహకారాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాస్కరాచారి, గౌతమ్‌కుమార్ పాల్గొన్నారు.

పదిపరీక్షల్లో విద్యార్థులు ప్రతిభను కనపరచాలి



మాట్లాడుతున్న డీవైఈఓ శ్రీరాం పురుషోత్తం

నిమ్మనపల్లె : పది పరీక్షలలో విద్యార్థులు ప్రతిభ చాటాలని మదనపల్లె ఉప విద్యాశాఖాధికారి శ్రీ రాం పురుషోత్తం అన్నారు. మండలంలోని ముష్టూరు కేజీబీవీని ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పది విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పరిశీలించి టీచర్లకు సూచనలు చేశారు. విద్యార్థుల అభ్యసనంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని కోరారు. ఐఎఫ్‌పి ప్యానెల్ బోర్డులను ఉపయోగించుకొని పాఠశాల అభివృద్ధిలో ప్రతి ఉపాధ్యాయుడు భాగస్వామి కావాలని సూచించారు.

చదువుతోపాటు క్రమశిక్షణ నేర్పాలి

రాయచోటి టౌన్ : విద్యార్థులకు నాణ్యమైన చదువుతోపాటు క్రమశిక్షణ నేర్పాలని డీఈఓ శివప్రకాష్‌రెడ్డి అన్నారు. గురువారం రాయచోటి పట్టణ పరిధిలోని మాసాపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను డీఈఓ ఆకస్మిక తనిఖీ చేశారు. తరగతి గదిలోకి వెళ్లి పిల్లలతో మాట్లాడారు. అనంతరం 10వ తరగతి పరీక్షల కోసం విద్యార్థులను ఎలా సిద్ధం చేస్తున్నారనే విషయాలపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమై మాట్లాడారు. సిలబస్ పూర్తి చేసిన తరువాత విద్యార్థులతో పూర్తిస్థాయిలో ప్రశ్నాపత్రాల తీరుతెన్నులపై అవగాహన కల్పించాలని చెప్పారు. 10వ తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న గ్రాండ్ టెస్ట్ పరీక్షల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటి నుంచే విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలకు సిద్ధం చేయాలని చెప్పారు. విద్యార్థులు మానసిక ఒత్తిడి లేకుండా ఉండేందుకు యోగా, ధ్యానం సాధన చేయాలన్నారు.

ప్రాజెక్టులను అడ్డుకున్న ద్రోహి చంద్రబాబు

- ప్రాజెక్టులను అడ్డుకున్న ద్రోహి చంద్రబాబు
- తంబళ్లపల్లెను అభివృద్ధి చేశాం
- ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి



బి.కొత్తకోట ఆసరా సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

బి.కొత్తకోట : రైతుల కోసం నిర్మిస్తున్న సాగునీటి ప్రాజెక్టులను అడ్డుకున్న చంద్రబాబు రైతు ద్రోహి అని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అన్నారు. బి.కొత్తకోట నగర పంచాయతీ కార్యాలయ ఆవరణలో గురువారం వైఎస్సార్ ఆసరా నిధుల పంపిణీ సభ జరిగింది. ఈ సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ముదివేడు, ఆవులపల్లె, నేతికుంటపల్లె సాగునీటి ప్రాజెక్టులపై అక్రమ కేసులు వేయించి పనులను ఆపివేయించారన్నారు. రైతుల సంక్షేమం, అభివృద్ధి చంద్రబాబుకు పట్టదని, వార్డు సభ్యుడైనా కాని లోకేష్‌ను మంత్రిని చేశారని విమర్శించారు. ప్రతి సమస్యను పరిష్కరిస్తున్నా, పర్యటించిన ప్రతి చోట ప్రజల వినతులు ఆలకించి చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. నివాస గృహాలపై విద్యుత్ సరఫరా తీగలు లేకుండా తొలగించామన్నారు. పనితీరులో లోపాలుంటే చెబితే సరిదిద్దుకుంటానన్నారు. నియోజకవర్గంలో వైఎస్సార్ ఆసరా కింద మహిళలకు నాలుగు విడతల్లో రూ.170.36 కోట్లు ప్రభుత్వం చెల్లించిందన్నారు. ఎన్నికల్లో మహిళా సంఘాల రుణాల మాఫీ మాటను సీఎం వైఎస్.జగన్ నిలబెట్టుకున్నారన్నారు. అనంతరం బి.కొత్తకోట, పెద్దతిప్పసముద్రం, కురబలకోట మండలాలకు చెందిన మహిళా సంఘాలకు చెక్కులు అందించారు.

పనులు పూర్తి చేయండి

బి.కొత్తకోట పట్టణంలో మంజూరైన అభివృద్ధి పనులను సత్వరమే పూర్తి చేయించాలని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి కోరారు. నగర పంచాయతీ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ పీఆర్.మనోహర్, ఏఈ రాజేంద్ర, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో జరిగిన సమావేశంలో జీజీఎంపీ, ఎంపీల్యాడ్స్, 15వ ఆర్థిక సంఘ నిధులతో చేపట్టిన మురికినీటి కాలువలు, సీసీరోడ్ల పురోగతిపై సమీక్షించారు. ఎక్కడా లేని విధంగా బి.కొత్తకోటకు జీజీఎంపీ కింద అదనంగా రూ.కోటి నిధులు మంజూరు చేయించినట్లు చెప్పారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాల కల్పన కోసం సహకరించాలని కోరారు. త్వరలో బి.కొత్తకోటలో ఇంటింటి పర్యటన ప్రారంభిస్తానని, ఈలోపు పనులు పూర్తి కావాలని ఆదేశించారు.

పేదలకు 1,200 ఇళ్లు

చరిత్ర సృష్టించేలా బి.కొత్తకోటలో పేదలకు 1,200 ఇంటిస్థలాలను పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అధికారులను ఆదేశించారు. నగర పంచాయతీ కార్యాలయంలో తహసీల్దార్ పుణ్యవతి, కమిషనర్ మనోహర్, ఆర్ఐ బాలాజీ, విఆర్ఓలతో ఇళ్ల పట్టాలపై సమీక్షించారు. కొత్తగా 1,200 మందికి ఇంటిస్థలాల కేటాయింపు పనులు పూర్తి చేశామని, ఈ నెల 19న పట్టాల పంపిణీ చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ లక్ష్మ నరసమ్మ, మహమూద్, జెడ్పీటీసీలు రామచంద్ర, బైసాని జ్యోతి, శివన్న, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు ప్రదీప్‌రెడ్డి, గణపతి, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు అనితా చక్రవర్తి, నగినా, సర్పంచులు నాగిరెడ్డి, రుక్మిణి, సాంబశివ, గిరిజ, మాజీ సర్పంచు రియాసత్ అలీఖాన్, నాయకులు బలరాంరెడ్డి, కళ్యాణ్‌రెడ్డి, అభిలాష్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి పేదలకు వరం

- సమన్వయకర్త నిసార్ అహ్మద్
- 8 మంది బాధితులకు రూ.23,28000 పంపిణీ



బాధితులకు సీఎం సహాయనిధి చెక్కులు అందిస్తున్న నిస్సార్ అహ్మద్, షమీమ్‌అస్లాం తదితరులు

మదనపల్లె : పేద, మధ్య తరగతి ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిధి వరంలా మారిందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నిస్సార్ అహ్మద్, ఏపీఎండీసీ చైర్ పర్సన్ షమీమ్ అస్లాం అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో 8 మందికి రూ.23,28000 రూపాయల సీఎం సహాయనిధి చెక్కులను గురువారం వారు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఆర్థిక స్తోమత లేని పేదలకు సీఎం సహాయనిధి పథకం అండగా నిలుస్తోందన్నారు. పేదల కోసం మహానేత డాక్టర్.వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని తీసుకువస్తే...ఆయన బిడ్డ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి 3,257 రకాల వ్యాధులను ఆరోగ్యశ్రీలో చేర్చి సేవలు అందిస్తున్నారన్నారు. సంక్షేమం, అభివృద్ధి మరింత మెరుగ్గా అందాలంటే వైఎస్సార్‌సీపీని ప్రజలు ఆదరించాలన్నారు. అనంతరం సీఎం సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకున్న నక్కలదిన్నెకు చెందిన వై.ప్రసాద్‌కు రూ.5,20,000, దేవళంవీధికి చెందిన సయ్యద్‌ఫాతిమాకు రూ.58వేలు, వలసపల్లె కృష్ణాపురానికి చెందిన బి.అలివేలుకు రూ.50 వేలు, త్యాగరాజ వీధికి చెందిన అనూషకు రూ.1.40 లక్షలు నర్సింగ్‌హోం స్ట్రీట్‌కు చెందిన ఆర్.రోజారమణికి రూ.10లక్షలు, కొత్తపల్లె-2కు చెందిన డి.సురేంద్రకు రూ.1.50 లక్షలు, వి.వేణుగోపాల్‌రెడ్డికి రూ.1.10 లక్షలు,, కోళ్లబైలుకు చెందిన ఈ.అంజమ్మకు రూ.3లక్షల రూపాయల చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ తట్టి శ్రీనివాసులురెడ్డి, కౌన్సిలర్లు బి.ఏ.ఖాజా, మేస్త్రీశ్రీనివాసులు, ఆర్.వి.శివారెడ్డి, ఎస్వీ.రమణ, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగరాజరెడ్డి, సలీం, నరిబాబాయ్, వినుతాభాయి తదితరులు పాల్గొన్నారు.

అందరికీ సంపూర్ణ ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయం

- అందరికీ సంపూర్ణ ఆరోగ్యమే ధ్యేయం
- ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



ఆరోగ్యశ్రీ కార్డులను అందజేస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

వాల్మీకిపురం : పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని ఉచితంగా అందించి సంపూర్ణ ఆరోగ్యవంతులను చేయడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఆరోగ్యశ్రీ కార్డులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, జగనన్న ఆరోగ్య సురక్ష, 108, 104, ఆరోగ్య సేవలతో ప్రజారోగ్యానికి ప్రభుత్వం భరోసా కల్పిస్తోందన్నారు. సీఎం 3225 వ్యాధులను ఆరోగ్యశ్రీలో చేర్చి, రూ.25 లక్షల వరకు వైద్య సేవలు ఉచితంగా పొందే అవకాశం కల్పించి పేద ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. కేన్సర్ బాధితులకు పరిమితి లేని చికిత్స అందిస్తూ ఆరోగ్యశ్రీ పథకం సంజీవనిలా పని చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నీళ్లభాస్కర్, కేశవ రెడ్డి, ఆనంద, సాధిక్, ఫణి, కిట్టూ, శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు కలికిరిలో ఎమ్మెల్యే చింతల పర్యటన

కలికిరి : పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి కలికిరిలో పర్యటిస్తారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్ కుమార్ రెడ్డి తెలిపారు. స్థానిక మెయిన్ స్కూల్ ఆవరణలో జరిగే కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొంటారన్నారు. కార్యక్రమానికి నాయకులు,అధికారులు హాజరవ్వాలని ఆయన కోరారు.

నూతన సచివాలయం ప్రారంభం



సచివాలయ భవన ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

గుర్రంకొండ : అభివృద్ధి చేసి చూపించిన ఘనత సీఎం జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందని జెడ్పీటీసీ సప్రీమ్ ముక్తియార్, ఎంపీపీ సీతమ్మ అన్నారు. మండలంలోని చెర్లోపల్లెలో నూతనంగా నిర్మించిన సచివాలయం, విలేజ్ క్లినిక్ భవనాలను గురువారం వారు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ పరిపాలన ప్రజల వద్దకే తెచ్చి సీఎం దేశ చరిత్రలో నిలిచిపోయారన్నారు. ప్రతిపక్షాల విమర్శలకు జవాబు కావాలంటే గ్రామాలకు వచ్చి నిర్మించిన భవనాలను చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జయచంద్రారెడ్డి, నక్కా చంద్రశేఖర్, అప్పల్ల, ఎల్వీరమణ, నరసింహారెడ్డి, కౌసల్య, బివిరెడ్డి, రామ్మోహన్, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉత్తమ బోధన



రత్నమ్మను సన్మానిస్తున్న ఎంఈఓలు, ఉపాధ్యాయ బృందం

నిమ్మనపల్లె : విద్యార్థులకు ఉత్తమ విద్య బోధిస్తూ కె. రత్నమ్మ 40 ఏళ్లు విజయవంతంగా పూర్తి చేశారని ఎంఈఓలు పద్మావతి, నారాయణ అన్నారు. మండలంలోని కొమ్మిరెడ్డిగారి పల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న కే.రత్నమ్మ ఉపాధ్యాయ వృత్తిలో 40 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఉపాధ్యాయులు, ఎమ్మార్సీ సిబ్బంది గురువారం ఘనంగా సన్మానించారు. ఎంఈవోలు మాట్లాడుతూ బోధించపోయే అంశాన్ని నేర్చుకొని విద్యార్థులకు రత్నమ్మ అర్థవంతంగా బోధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కె.నాగేంద్ర కుమార్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల అభివృద్ధే లక్ష్యం



పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతున్న డివైఈఓ పురుషోత్తం

మదనపల్లె సిటీ : విద్యార్థుల అభివృద్ధే లక్ష్యంగా ఉపాధ్యాయులు పనిచేయాలని మదనపల్లె డీవైఈఓ శ్రీరాం పురుషోత్తం పేర్కొన్నారు. స్థానిక మయాబజార్‌లోని వివేకానంద మున్సిపల్ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ రాబోవు పదో తరగతి వార్షిక పరీక్షలలో విద్యార్థులు ప్రతిభ కనబరిచి ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రత్యేక శిక్షణ కల్పించాలన్నారు. అనంతరం విద్యార్థులు రాసిన పరీక్షా పేపర్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలో అమలవుతున్న జగనన్న గోరుముద్ద, రాగిజావ కార్యక్రమాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాసులు, పురం వెంకటరమణ, గాలి రవీంద్ర, ఖాదర్‌బాష, విద్యార్థులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలపై అవగాహన



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న హెచ్ఎం అంజాద్ అలీఖాన్, ఉపాధ్యాయ బృందం

నిమ్మనపల్లె : విద్యార్థి దశ నుంచే వస్తువుల నాణ్యతా ప్రమాణాలపై అందరూ అవగాహన పెంచుకోవాలని ప్రధానోపాధ్యాయులు కే.అంజాద్ అలీఖాన్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ (తెలుగు) లో గురువారం బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (భారతీయ ప్రమాణాల సంస్థ) ఆధ్వర్యంలో స్టాండర్డ్స్ క్లబ్ ఏర్పాటుచేశారు. ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ స్టాండర్డ్స్ క్లబ్ ద్వారా సూచనలు తీసుకుని వస్తువుల కొనుగోలు సమయంలో నాణ్యత తెలుసుకోవాలన్నారు. అనంతరం వ్యాసరచన పోటీలల వరుస విజేతలుగా నిలిచిన మైథిలీ రెడ్డి, బి.హర్షిత, శ్రావ్యలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డా.రాజేంద్ర కుమార్, ఉపాధ్యాయులు సహదేవ రెడ్డి, రమణప్ప, రెడ్డి శేఖర్, రవీంద్ర పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలపై దృష్టి పెట్టండి



రామసముద్రంలో తహశీల్దార్‌ను కలిసిన వైస్ ఎంపీపీ రమణారెడ్డి, కన్వీనర్ నంద, ఆనంద

రామసముద్రం : రెవెన్యూ సమస్యలపై సిబ్బంది దృష్టి పెట్టేలా చర్యలు తీసుకోవాలని వైస్ ఎంపీపీ రమణారెడ్డి , మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ నంద, వాల్మీకి సంఘం అధ్యక్షులు దొడ్డిపల్లి ఆనంద లు కలసి తహశీల్దార్ శ్రీనివాసులను కోరారు. గురువారం నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహశీల్దార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సన్మానించి, వివిధ సమస్యలను వివరించారు. తహశీల్దార్ మాట్లాడుతూ మండల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. మండల ప్రజలకు ఎళ్లవేళలా అందుబాటులో ఉంటానన్నారు. రైతులకు రెవెన్యూ సమస్యలు ఉంటే తక్షణమే పరిష్కరిస్తానన్నారు. విద్యార్థులకు ఎప్పటికప్పుడు సర్టిఫికెట్లు మంజూరు చేయించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సిహెచ్.ప్రకాష్, సర్పంచ్ ఆదినారాయణ, సుబ్బన్న తదితరులు పాల్గొన్నారు.

‘జీఎంఆర్ పాలిటెక్నిక్’కు న్యాక్ గుర్తింపు

మదనపల్లె సిటీ : నిమ్మనపల్లె రోడ్డులోని జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలకు నేషనల్ బోర్డు ఆఫ్ అక్రిడేషన్ గుర్తింపు లభించిందని ప్రిన్సిపల్ కె.ఓబులేసు తెలిపారు. విలేకరులతో గురువారం ఆయన మాట్లాడుతూ ఢిల్లీలోని ఎన్‌బిఏ కార్యాలయం నుంచి సమాచారం అందిందన్నారు. అత్యాధునిక ల్యాబ్ సౌకర్యం , అర్హత గల అధ్యాపకులు, ప్రాంగణ ఎంపికల ఆధారంగా ఈ గుర్తింపు లభించిందన్నారు. 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఏప్రిల్ 27న జరిగే పాలిసెట్ ప్రవేశ పరీక్ష రాసి అడ్మిషన్ పొందవచ్చునన్నారు. సిబ్బంది సావిత్రి, మురళి, అధ్యాపకులు, అధ్యాపకేతర బృందం ప్రిన్సిపల్‌కు అభినందలు తెలిపారు.

సైన్స్ కళాయాత్రతో శాస్త్రీయ దృక్పథం పెంపు

రాయచోటి అర్బన్ : విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకే సైన్స్ కళాయాత్రను నిర్వహిస్తున్నట్లు జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నేతలు మురళీధర్‌రావు, త్రిమూర్తులు అన్నారు. గురువారం స్థానిక సాయి ఇంజనీరింగ్ కళాశాలలో సైన్స్ కళాయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల, కళాశాల విద్యార్థులకు వినోద, విజ్ఞాన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో శ్రీకాకుళం నుంచి మొదలైన ఈ యాత్ర అనంతపురం జిల్లాలో ముగుస్తుందన్నారు. యాత్రలో 25 మంది కళాకారులు పాల్గొంటున్నారన్నారు. వారి చేత సైన్స్ నాటికలు, సైన్స్ పాటలు, మ్యాజిక్ షో, సైన్స్ ప్రయోగాలు మొదలైన అంశాలు ప్రదర్శితమతాయన్నారు. కళాశాల ఏడీ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ జనవిజ్ఞాన వేదిక ప్రజల్లోని మూఢ నమ్మకాలను తొలగించేందుకు తీవ్రంగా కృషి చేస్తోందంటూ అభినందించారు. మానవత రాష్ట్రనేత సహదేవరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు ఆటపాటల ద్వారా విజ్ఞానాన్ని కలిగించేందుకు జనవిజ్ఞాన వేదిక కృషి చేస్తుండడం అభినందనీయమన్నారు. 25 మంది కళాకారులు చేసిన ప్రదర్శనలు విద్యార్థులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో లయన్ హరినాథరెడ్డి, జేవీవీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రేమచరణ్, ప్రకాష్‌రెడ్డి, నేతలు ఆంజనేయులు, శేషారెడ్డి, వినయ్‌కుమార్, ప్రజా నాట్యమండలి సభ్యులు, సాయి కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేవీవీ రాష్ట్రనేత మురళీధర్‌రావు

కనువిందుగా శ్రీనివాసుడి కళ్యాణం



స్వామివారి కల్యాణోత్సవం

తంబళ్లపల్లె : మండలంలోని కోసువారిపల్లెలో వెలసిన శ్రీప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వారం రోజులుగా టీటీడీ ఆధ్వర్యంలో వైభవంగా జరుగుతున్నాయి. గురువారం ఉదయం ఉప ప్రధాన అర్చకులు కృష్ణప్రసాద్‌బట్టార్, అర్చకులు రమేష్‌బాబులు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుడిని సర్వభూపాల వాహనంపై ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం సంప్రదాయబద్ధంగా ఊరేగించారు. రాత్రి స్వామివారి కళ్యాణం కనువిందుగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, కవితమ్మ దంపతులు కళ్యాణోత్సవా న్ని తిలకించారు. ప్రతి ఒక్కరికి దైవచింతనతోనే మానసిక ప్రశాంతతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని వారు పేర్కొన్నారు. అనంతరం హరికథ, సంగీతం, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో వరలక్ష్మీ, ఏఈవో గోపినాథ్,కుమార్, విజయలక్ష్మీ, శ్యామలమ్మ, సురేంద్రనాథ్, నాయకులు పాల్గొన్నారు.

22న సీతారామాలయం ప్రారంభోత్సవం

బి.కొత్తకోట : మండలంలోని బయ్యప్పగారిపల్లె పంచాయతీ పామూరివారిపల్లెలో నిర్మించిన సీతారామాలయ ప్రారంభోత్సవ కార్యక్రమాలు ఈ నెల 22 నుంచి మూడురోజుల పాటు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు.ఆలయ ప్రారంభోత్సవానికి ప్రజలు తరలిరావాలన్నారు.

నేటి నుంచి రథసప్తమి వేడుకలు



ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవారు

రామసముద్రం : మండల కేంద్రంలో వెలసిన లక్ష్మీ జనార్ధనస్వామి బ్రహ్మోత్సవ రథ సప్తమి వేడుకలు శుక్రవారం నుంచి అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు అర్చకులు పార్థసారధి బట్టర్, కులశేఖర్‌బట్టర్ తెలిపారు. శ్రీదేవి భూదేవి సమేత శ్రీలక్ష్మీ జనార్ధనస్వామికి రోజూ విశేషాలంకరణ, ఊంజల్‌సేవ , తీర్థప్రసాద వితరణ ఉంటుందన్నారు. భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకోవాలని కోరారు.

అభివృద్ధి పథంలో చౌక్కాండ్లపల్లె

రామసముద్రం : మండలంలోని చొక్కాండ్లపల్లి గ్రామ పంచాయతీ అభివృద్ధి పథంలో పయనిస్తోందని పంచాయతీ అభివృద్ధి కమిటీ చైర్మన్ గెవన్న తెలిపారు. కననగాని గ్రామం ఎస్సీ కాలనీలో గురువారం మురుగు కాలువ నిర్మాణ పనులను వారు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రోడ్లు , డ్రైనేజీలు లేక కలిగే ఇబ్బందులను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ,ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిధున్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా నిధులు మంజూరు చేయించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో నందకిషోర్‌రెడ్డి, పవన్, రమణ, గోవింద్, తిమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

కోదండరామ విగ్రహ ప్రతిష్ట



మొలకలదిన్నెలో నూతనంగా ప్రతిష్టించిన శ్రీ కోదండ సీతారామ లక్ష్మణస్వామి

మదనపల్లె : మండలంలోని రామాచార్లపల్లె పంచాయతీ మొలకలదిన్నెలో నిర్మించిన కోదండ రామాలయంలో గురువారం కోదండ సీతారామ లక్ష్మణస్వాముల విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా జరిగింది. నియోజకవర్గ సమన్వయకర్త నిస్సార్ అహ్మద్, మాజీ ఎమ్మెల్సీ బి.నరేష్‌కుమార్‌రెడ్డి స్వామిని దర్శించుకున్నారు. ఆర్‌బీకే చైర్మన్ కత్తిరాజు, సర్పంచ్ లక్ష్మీదేవమ్మ వారికి ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు హాజరై స్వామిని దర్శించుకున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల సందర్శన



మాట్లాడుతున్న ప్రథమ్ సంస్థ సభ్యులు

మదనపల్లె : మదనపల్లెలోని ఇందిరానగర్-1,2 మోడల్ అంగన్‌వాడీ కేంద్రాలను గురువారం ప్రథమ్ సంస్థ సభ్యులు బి.సూరిబాబు, ప్రోగ్రామ్ అసోసియేట్ వై.భాస్కరరెడ్డి, జిల్లా కోఆర్డినేటర్ అసిస్టెంట్ ఏఎంఓ ఎస్.సమీవుల్లా, సీడీపీఓ సుజాత సందర్శించారు.. పూర్వ ప్రాథమిక విద్యా కార్యక్రమాలపై విచారించారు. వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రతిరోజూ పిల్లల తల్లులకు గ్రూప్ ఏర్పాటుచేసి పంపాలన్నారు. అనంతరం తల్లులతో సమావేశం నిర్వహించి, అంగన్‌వాడీ కేంద్రాల్లో జరిపే కార్యక్రమాలపై వివరించాలన్నారు. కార్యక్రమంలో మాధవి, జయలక్ష్మి పాల్గొన్నారు.

20 మద్యం బాటిళ్లు స్వాధీనం

గుర్రంకొండ : 20 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని నిందితుడ్ని అరెస్టు చేసినట్లు ఎస్ఐ నాగార్జున రెడ్డి తెలిపారు. కలకడ మండలం నడిమిచెర్ల గ్రామానికి చెందిన శ్రీనివాసులు 20 మద్యం బాటిళ్లు తరలిస్తుండగా స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు.